ప్రజాశక్తి

శుక్రవారం 19 డిసెంబర్ 2025

5



పీసా చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని శోభకోట పంచాయతీ ఆర్లాడ గ్రామంలో పేసా చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సభకు పేసా అధ్యక్షులు, శోభకోట పంచాయతీ సర్పంచ్ శశిభూషణ్ నాయుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరై పేసా చట్టం అమలు విధానం, గ్రామసభల పాత్ర, గిరిజనుల హక్కులు, సహజ వనరులపై గ్రామసభ అధికారాలు తదితర అంశాలపై రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పేసా చట్టం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని వివరించారు. సభలో రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

పసుపునకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



పసుపును చూపుతున్న సురేంద్ర

ప్రజాశక్తి- హుకుంపేట: పసుపు రైతులకు కిలోకు రూ.200 గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ఉచితంగా పసుపు ప్రాసెసింగ్ యూనిట్లు పంపిణీ చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపర్చే చర్యలను తీవ్రంగా ఖండించారు. జీకే మండ పంచాయతీ గడ్డిమర్రి గ్రామంలో ఆదివాసీలు పండిస్తున్న పసుపు పంటలను ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, హుకుంపేట మండల ఆదివాసీ సంఘం కార్యదర్శి టి.కృష్ణారావు పరిశీలించారు. అనంతరం విలేకరులతో సురేంద్ర మాట్లాడుతూ, ఆదివాసీ ప్రాంతాల్లో పండుతున్న ఏజెన్సీ బంగారం పసుపును కిలోకు రూ.200కి కొనుగోలు చేసినప్పుడే రైతులకు గిట్టుబాటు లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా పసుపు బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు రైతులకు ప్రాసెసింగ్ యూనిట్లు పంపిణీ చేయాలని, తద్వారా విలువ ఆధారిత ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి దానిని పథకంగా మార్చే ప్రయత్నాలను ఆదివాసి గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉపాధి హామీ చట్టాన్ని సవరించి, ఒక పథకంగా మార్చడం సరికాదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర వాటాను తగ్గించి రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం ద్వారా నిర్వీర్యం చేయాలన్న ప్రయత్నాన్ని ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టం తొలగితే ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి లేక వలసలు పెరుగుతాయని, దీంతో గంజాయి తదితర మాదక ద్రవ్యాల వ్యాప్తి ప్రమాదం కూడా పెరుగుతుందని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు సంబంధించిన జీఓ 3 తదితర హక్కులు తొలగించడంతో ఆదివాసీ ప్రజలు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణారావుతో పాటు పసుపు రైతులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమతో ఆర్థికంగా లబ్ధి

-ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీపూజ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రంలోని పట్టు పరిశ్రమ ప్రధాన కార్యాలయంలో గురువారం స్కిల్ సమగ్ర-2 పథకంపై పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్, తిరుమణి శ్రీపూజ మాట్లాడుతూ, 2014 సంవత్సరం నుండి ఇంతవరకు రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపకుండా పట్టు పరిశ్రమ పంట లో నిమగ్నమై పట్టుగుళ్ల దారం ఉత్పత్తి చేస్తున్నారన్నారు. పట్టు పరిశ్రమ శాఖలో పదవి విరమణ ద్వారా ఉద్యోగుల సంఖ్య తగ్గడంతో పట్టు పరిశ్రమ రైతులకు పట్టుపురుగుల ఉత్పత్తి తగ్గిందని, గత మూడు సంవత్సరాల నుండి పట్టు రైతులకు అవగాహన కల్పిస్తూ పట్టు ఉత్పత్తిలో 400 మంది రైతులతో సుమారుగా 800 ఎకరాలలో పట్టుపురుగుల మలబార్ సాగు చేస్తున్నమన్నారు. సంవత్సరంలో పది పంటలు తీసుకొని ప్రతి నెల ఆదాయం వచ్చే విధంగా చూస్తున్నామన్నారు. ప్రస్తుత పట్టు రైతుల ద్వారా మిగిలిన రైతులకు అవగాహన కల్పించి పట్టు పరిశ్రమ ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. మల్బరీ ఉత్పత్తి చేసే ఎస్సీ ఎస్టీ రైతులకు ఉత్పత్తిలో 90 శాతం రాయితీలు కల్పిస్తూ, ఇతర కులాల రైతులకు రైతులకు 75 శాతం ఇస్తున్నామన్నారు. స్కిల్ సమగ్ర-2 ద్వారా యాంత్రీకరణ పథకం కింద 5 యూనిట్లను, రోగ నిరోధక మందులను 156 యూనిట్లను, రేసింగ్ పరికరాలు 12 మందికి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి కె. అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నందు, రైతులు పాల్గొన్నారు.



మిషన్లు అందజేస్తున్న శ్రీపూజ

'ఉపాధి హామీ'లో సవరణలపై..

నేడు సిపిఎం నిరసనలు

జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స పిలుపు



మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం చేస్తున్న సవరణలపై సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 19న శుక్రవారం అన్ని మండలాల్లో గాంధీ విగ్రహాల వద్ద సత్యాగ్రహ, మౌనదీక్షలతో నిరసన తెలియజేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి. అప్పల నరస ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు రానున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి ఆర్ఎమ్ జి) పేరుతో ఉపాధిహామీ పథకానికి "రాంరాం" పలకనున్నారని పేర్కొన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్‌ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చి వేసి అవసరాన్ని (సప్లయిని) బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించారని తెలిపారు. పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని, ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని పేర్కొన్నారు.వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల ఉపాధిని సస్పెండ్ చేసి ఈ పథకాన్ని రైతులకు పోటీగా మారుస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు ఇప్పటి వరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు నాలుగు వేల కోట్లు అదనపు భారం పడనుందని, ఇప్పటికే లక్షల కోట్లు అప్పుల్లో వున్న రాష్ట్రం ఈ అదనపు భారాన్ని ఎలా భరించగలదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా వున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంటులో దీన్ని వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 19వ తేదీ గాంధీజీ విగ్రహాల వద్ద సిపిఎం చేస్తున్న నిరసనల్లో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందర్‌రావు, వి.దాస్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని ఎస్టి జోసెఫ్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు - అప్రమత్తంపై జిల్లా సైబర్ క్రైమ్ సీఐ వెంకటరమణ, అరకు సీఐ ఎల్ హిమగిరి గురువారం గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఐడి, పాస్‌వర్డ్‌లను ఎలా హ్యాక్ చేస్తారు, కమిషన్ ఆశ చూపించి కేసుల్లో ఇరికిస్తారు అనే విషయాలను వివరించారు. ఆన్లైన్ ట్రేడింగ్ పేరుతో, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, టెలిగ్రామ్, వాట్సాప్‌లో లక్ష్యం పేరుతో జరిగే ఇన్వెస్ట్‌మెంట్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యూట్యూబ్‌లో లైకులు కొడితే డబ్బులు ఇస్తామంటూ సైబర్ నేరగాళ్ల ఆశ చూపించి మోసాలు చేస్తున్నారని తెలిపారు.మొదట కొద్దిపాటి డబ్బులు తీసుకుని తరువాత ఎక్కువ మొత్తాలు అడిగి చివరకు బ్లాక్ చేస్తారని ఇటువంటి మోసాలను నమ్మవద్దని సూచించారు.ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ సిస్టర్ బిందు, కరస్పాండెంట్ సిస్టర్ రూబీ, సిబ్బంది శ్రీను, వెంకట్రావు, కృష్ణారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ హిమగిరి



గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని పట్టాం పంచాయతీ కుమ్మరి పుట్టు గ్రామంలో గురువారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్థానిక పాస్టర్ కె.యోహాను ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. పాస్టర్ జాన్ వాక్యసందేశం అందించారు. మండల ఫెలోషిప్ అధ్యక్షులు కే. ప్రేమ్ కుమార్, రాజారావు, పి.సమూయేలు, ఎస్. జాన్ వింకిల్, బి. సమూయేలు, మల్లన్న, డేవిడ్ ప్రసాద్, దేవరాజు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు :: మండల కేంద్రంలోని హెూలీ గ్రౌండ్ వద్ద గురువారం ఇమ్మానుయేలు హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు, ఫాస్టర్ కిల్లో మోహన్ అధ్యక్షతన ఘనంగా ఐక్య క్రిస్మస్ నిర్వహించారు.దైవజనులు కొడాలి విజయ్ కుమార్ వాక్యోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షురాలు సన్యాసమ్మ, పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు వైకుంఠం పాల్గొన్నారు.

21న అమరవీరులకు కళా నీరాజనం

- చింతూరు తరలివస్తున్న కళాబృందాలు
- ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఐవి
- సంస్మరణ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చింతూరు : అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 21న చింతూరులో బహిరంగసభ జరుగుతుందని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఐవి తెలిపారు. ఆ రోజున రంపచోడవరం జిల్లా పరిధిలోని ప్రజా కళాకారులందరూ నివాళులర్పించేందుకు తమ కళారూపాలతో తరలిరానున్నారని తెలిపారు. గురువారం చింతూరులో జిల్లా అధ్యక్షులు సోడె దుర్గారావు అధ్యక్షతన పిఎన్ఎం. జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, గ్రామాల నుండి రేలారే రేలా, థింసానృత్యాలు, డప్పు దరువులతో, డోలు కొయ్యల అడుగులతో, అందెలనృత్యాలతో కళాప్రదర్శన లిచ్చేందుకు కళాకారులు వస్తున్నారని తెలిపారు. ప్రజల జీవితాలను బాగు చేయడం కోసం తుది శ్వాస వరకు పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవడం కోసం చింతూరు వీధుల్లో కళారూపాలతో ప్రజానాట్యమండలి కళాకారులు నివాళులర్పించి బోతున్నారన్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, జానపద కళారూపాలను ప్రదర్శించడానికి కళాకారులంతా సిద్ధమవుతున్నారన్నారు. కళారూపాలు ప్రదర్శించే యువత పెద్ద ఎత్తున చింతూరు తీసుకురావాలని ఐ.వి. పిలుపునిచ్చారు.. కార్యక్రమంలో జిల్లా నాయకులు సిహెచ్.సుబ్బారావు, కారం కన్నారావు, పత్రా రమేష్, మొట్టుం రాజయ్య, బాడిస శేషు, మడివి రాజేష్, మోసం హరీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఐవి

విఆర్.పురం: 21న చింతూరులో నిర్వహించే అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కారం సుందరయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అడివి వెంకన్నగూడెం గ్రామంలోని అమరవీరుల స్థూపాలను సిపిఎం ఆధ్వర్యంలో శుభ్రం చేసి రంగులు వేశారు. ఈ సందర్భంగా కారంసుందరయ్య మాట్లాడుతూ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా 21న చింతూరులో సంస్మరణ సభను జయప్రదం చేయాలని అన్నారు. అమర వీరుల త్యాగాలు ఎన్నటికీ మరువ లేనివని,వారి త్యాగాల ఫలితమే నేటి మన్యప్రాంత అభివృద్ధి అన్నారు. గిరిజన హక్కులు, చట్టాల రక్షణకు ప్రాణాలు సైతం లెక్కచేయక పోరాడారని గుర్తు చేసారు. సిపిఎం ఎమ్మెల్యేలుగా గెలిచిన కుంజ బుజ్జి, సున్నం రాజయ్య వల్లే భద్రాచలం నియోజకవర్గం అభివద్ధి చెందిందని, వారి సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపాన్ని శుభ్రం చేస్తున్న సిపిఎం శ్రేణులు

విఆర్ పురం: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో శాఖా కార్యదర్శి ఆత్మకూరు కాంతారావు అధ్యక్షతన సిపిఎం సమావేశంలో మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 21న చింతూరులో నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒకప్పుడు మన్యంలో ఎక్కడ చూసినా ఆదివాసీ ప్రజలపై అంతులేని దోపిడీ, వెట్టి చాకిరీ, మేకలపుల్ల మొదలై దందాలు, పోలీసులు, ఫారెస్టు, రెవెన్యూలాంటి ప్రభుత్వ శాఖలు కూడా ఊర్ల మీద పడి లూఠీలా చేసేవారని, తునికాకు మొదలుకొని అనేక అటవీ ఉత్పత్తులను సేకరిస్తే కాంట్రాక్టర్లు దోపిడీ చేసేవారన్నారు. . స్కూల్స్, హాస్పిటల్స్, అంగన్వాడీ సెంటర్లు, తాగునీరు, రోడ్లు, కరెంటు లాంటి సదుపాయాలు ఎక్కడా ఉండేవి కావు. సాగులో ఉన్న భూములకు పట్టాలు కూడా ఉండేవి కావు అమరవీరుల పోరాటాలతో అటువంటికి సాకారమయ్యా యన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు పంకు సత్తిబాబు మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామమూర్తి ,చీరపు తాతబాబు, తోడం రాజు. వార్డుసభ్యుడు పూసం రవి వర్మ, మాజీ సర్పంచ్ పులి ధర్మరాజు, పులి చంద్రావు, పిసా కమిటీ కార్యదర్శి కారం రాము పాల్గొన్నారు.



శ్రీరామగిరిలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

చిరుతపులి అడుగు జాడల గుర్తింపు

- ఆంధ్రా నుంచి ఒడిశా వైపు వెళ్లినట్లు నిర్ధారణ
- స్థానిక ప్రజలను అప్రమత్తం చేసిన అటవీశాఖ



చిరుత అడుగుజాడలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు



ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి జిల్లా జీకేవీధి మండలం సప్పర్ల ఘాట్ రోడ్డు రేయిన్ గేజ్ వద్ద బుధవారం సాయంత్రం చిరుతపులి సంచారంపై పత్రికల్లో వచ్చిన కథనాలపై అటవీ అధికారులు స్పందించారు. గురువారం సీలేరు రేంజ్ అటవీశాఖ అధికారి ఎస్ వెంకట్రావు ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజ్ అధికారి సతీష్ బేస్‌క్యాంప్ సిబ్బందితో కలిసి చిరుతపులి సంచరించే ప్రదేశానికి చేరుకున్నారు. పులి అడుగుజాడలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలోని రేయిన్ గేజ్ సమీపం నుంచి చిరుతపులి వెళ్లినట్లు అడుగుజాడలు గుర్తించారు. అనంతరం గాలికొండ పంచాయితీ పరిధి గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు సిబ్బంది పర్యటించి గిరిజనులను అప్రమత్తం చేశారు. చిరుత పులి సప్పర్ల ఘాట్ రోడ్లో సంచరిస్తుందని ఒంటరిగా ప్రదేశానికి ఎవరు సంచరించరాదని హెచ్చరించారు.. ప్రజల అవసరాల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు గుంపులు గుంపులుగా వెళ్లాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా రేంజ్ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ సప్పర్ల ఘాట్ రోడ్లో చిరుత పులి సంచారాన్ని అడుగుజాడను బట్టి గుర్తించమన్నారు. ఆంధ్ర నుంచి ఒడిశా వైపు పులి వెళ్లినట్లు పరిశీలన నిర్ధారణ అయిందన్నారు. ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేవారు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల సద్వినియోగానికి చర్యలు

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి జిల్లాలోని పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి కెపి చంద్రశేఖర్ వెల్లడించారు. గురువారం జీకే వీధి మండలం సీలేరు పంచాయతీలో పర్యటించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పర్యావరణం పరిశుభ్రతపై పెయింటింగ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. వారి ఆదేశాలకు అనుగుణంగా తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి ప్రతిరోజు క్లాత్ మిత్ర వర్కర్స్ కి అందజేసే విధంగా ప్రజలకి అవగాహన కల్పిస్తున్నామన్నారు. చెత్త నుంచి సంపద సష్టించే షెడ్ వద్ద విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నెలకొన్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 15వ సంఘం ఆర్థిక నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని డైరెక్ట్ గా పంచాయతీ అకౌంట్లో జమవుతుందన్నారు. సర్పంచి ఉప సర్పంచ్ కార్యదర్శి వార్డు సభ్యులు సమన్వయంతో ప్లాస్టిక్ నివారణకు చర్యలు తీసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటిగ్రేటెడ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం లో భాగంగా డిపిఒ స్థానిక శివాలయం వీధికి చేరుకొని ప్రజలతో సమావేశం అయ్యారు. క్లాత్ మిత్ర సభ్యులు పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఫోన్ కాల్స్ వస్తే పారిశుధ్య పనులపై నిర్వహణ పరిస్థితులపై అభిప్రాయాలను వ్యక్తం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వంతల పరశురాం గుమస్తా ప్రకాష్ సర్పంచ్ పాంగి దుర్జో ఉప సర్పంచ్ కేవలి ప్రసాద్ వార్డు సభ్యులు కూటమి సభ్యులు పాల్గొన్నారు.



ఐవిఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిపిఒ

21న పల్స్ పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : ఈ నెల 21న ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి మండలాన్ని జిల్లాలోనే ముందుంచాలని ఎంపిపి గోము వెంకటలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ లోకుల యాదగిరియేశ్వరావు అధ్యక్షతన పల్స్ పోలియో నిర్వాహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పిహెచ్‌సిల వైద్యాధికారులు సుష్మ, పావని,శరత్ చంద్ర ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు,అంగన్వాడీ కార్యకర్తలకు పోలియో చుక్కల పంపిణీపై అవగాహన కల్పించారు. పోలియో సదస్సు అనంతరం ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి 'పీసా'కమిటి విధివిధానాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వడుగుల జ్యోతి,సర్పంచ్ లు కొంగర మురళీకష్ణ, సీహెచ్ శివ,దాసరి నాగు, చంద్రుడు, సుబ్బలక్ష్మి, జగన్నాథం, రాజ్యలక్ష్మి, ఎంపిటిసిలు రాజేశ్వరి, లోవలక్ష్మి గంగదుర్గ,3 పిహెచ్‌సిల వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూసించారు.



మాట్లాడుతున్న ఎంపిపి గోము వెంకటలక్ష్మి

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలి



ముంచంగిపుట్టులో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఈ నెల 31 నుండి జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభను విజయ వంతం చేయాలని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. మండలంలోని వనగుమ్మ పంచాయతీ ఆసరడా గ్రామంలోనీ మూడు రోడ్డు జంక్షన్ వద్ద గురువారం సిఐటియు మండల కార్యదర్శి కె.శంకర్‌రావు అధ్వారంలో వివిధ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ప్రతి కార్మికులు ఐక్య పోరాటం చేయాలన్నారు. కార్మికుల హక్కులను, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ను తీసుకొచ్చి కార్మికుల గొంతు నొక్కిన మోడీ ప్రభుత్వంపై నిరసనలు చేపట్టాలన్నారు.వెంటనే నల్ల చట్టాలు ఉప సంహరించుకోవాలని, లేకుంటే భవిష్యత్తులో ఉద్యమాలు తప్పవన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26000 అమలు చేయాలని , ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వాలంటరీ సంఘం నాయకులు వి గిదోన్, పి.నర్సింగ్ మూర్తి, కే.చిన్నయ్య, గుప్త ప్రసాద్, కె శోభన్, కే సహదేవ్, రఘు, గంగాధర్ వివిధ కార్మికుల సంఘ నేతలు పాల్గొన్నారు.

చింతపల్లి: సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, దేశంలో నూటికి 99 శాతం పేదలు ఉంటే, ఒక్క శాతం ధనికుల కోసమే పాలకులు పని చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల భ్రమల్లో పేదలను ముంచి పాలన సాగించడం ఎక్కువకాలం కొనసాగదన్నారు. ప్రజలు నిజాన్ని గ్రహించిన రోజున ఆ తిరుగుబాటును ఎవరూ ఊహించలేరని తెలిపారు. ప్రపంచంలో పలు దేశాల అనుభవాలు ఇందుకు సాక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో తీవ్ర నిరుద్యోగం ఏర్పడుతోందని, నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున ఆధారపడుతున్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంఎన్ఆర్ఈజిఏ) రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. కమ్యూనిస్టుల పోరాటంతో సాధించిన ఈ చట్టం ద్వారా లక్షలాది కుటుంబాలు సంవత్సరానికి 100 రోజులు ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నాయని గుర్తు చేశారు. సిఐటియు కార్మిక అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని, ప్రజలు, కార్మికులు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్లు మోరి వెంకటగిరి, పాంగి ధనుంజయ్, నాగేశ్వరరావు, వెంకట్, అప్పారావు, భీమరావు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో ప్రచారం చేస్తున్న చిన్నయ్యపడాల్

నేరాలు ఘోరాలు



మంటలను ఆర్పుతున్న రైతులు

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మెరికేసింత పంచాయతీ డి.దసరాపల్లి గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన రెండు వరి కుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన దూసరి నాగేశ్వరరావు, దూసరి సుబ్బారావులు వరి పంటను కోతలు కోసి కుప్పలుగా వేశారు. మంటలు చెలరేగి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, తగిన నీటి సదుపాయం లేకపోవడంతో మంటలు అదుపులోకి రాలేదు. వరి కుప్పలు పూర్తిగా కాలిపోయాయి. సంవత్సరం పొడవునా శ్రమించి చేతికొచ్చిన పంట కళ్లముందే కాలి పోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

10 లీటర్ల సారా సీజ్

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో చందనాడ గ్రామానికి చెందిన దారా సత్య నూకరాజు తన బైక్‌పై నాటు సారా తీసుకు వెళ్తుండగా బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సన్ని బాబు తెలిపారు. సీఐ మురళికు వచ్చిన సమాచారం మేరకు నిఘా పెట్టగా, రాజయ్యపేట నుండి చందనాడ వెళ్లే మార్గంలో 5 బాటిల్‌లలో 10 లీటర్లు నాటు సారాను బైక్‌పై తీసుకు వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నాటు సారా, బైకును సీజ్ చేసి నూకరాజును గురువారం రిమాండ్‌కు తరలించారు.



కండువా వేస్తున్న దొన్నుదొర

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశకి- అరకులోయ రూరల్: అరకులోయ మండలం చిన్నలబుడు పంచాయితీ పరిధిలోని గొందివలస, దొరవలస గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఉపసర్పంచ్ గెమ్మేల చిరంజీవి, బురిడీ సుందరమ్మ, ముసిరి మల్లన్న, సాగరా రామారావు తదితర నాయకులు చేరారు. టీడీపీ సీనియర్ నాయకుడు, సర్పంచ్ అభ్యర్థి కిల్లో శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అరకు టీడీపీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నాయకత్వంలోనే రాష్ట్రానికి సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లోక్కయి మహాదేవ్, సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, నాయకులు సుబ్బారావు, కిల్లో దయ, గోకుల్ దాస్, బుడ్డి పరమానందం, తామల్ల కన్నయ్య, గొల్లూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పది వేల మంది సభ్యత్వమే లక్ష్యం

శ్రీ మహిళా మాతోట మ్యాక్స్ సొసైటీ సిఇఒ వెంకట సత్యనారాయణ



మాట్లాడుతున్న సిఇఒ

ప్రజాశక్తి-చింతపల్లి: పది వేల మంది మహిళలను సభ్యులుగా చేర్చుకునే లక్ష్యంతో శ్రీ మహిళా మా తోట మాక్స్ సొసైటీ కృషి చేస్తోందని ఆ సంస్థ సీఈవో నెల్లూరు వెంకట సత్యనారాయణ తెలిపారు. గురువారం చింతపల్లిలో నిర్వహించిన సంస్థ మహాజన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఏర్పాటైన ఈ సంస్థలో ఇప్పటి వరకు 6,000 మంది మహిళలు సభ్యులుగా చేరారని చెప్పారు. సభ్యులంతా ప్రతి నెలా పొదుపు చేస్తూ తమ అవసరాలకు అనుగుణంగా రుణాలు పొందుతున్నారని వివరించారు. ప్రస్తుతం చింతపల్లి, జీకే వీధి, జి.మాడుగుల మండలాల్లో సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే 10,000 మంది మహిళలను సభ్యులుగా చేర్చుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.50 లక్షల వరకు సభ్యులకు రుణాలు అందిస్తున్నామని, వచ్చే ఏడాది నుంచి కోటి వరకు రుణాలు మంజూరు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లోచల శారదా మాట్లాడుతూ, సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గతంలో రూ.50 వేల వరకు ఇచ్చే రుణాలను లక్ష వరకు పెంచామన్నారు. ఇక నుంచి అదనంగా మరో రూ.50 వేల వరకు రుణ పరిమితిని పెంచినట్లు తెలిపారు.

సంస్థ మేనేజర్ జల్లి బాబురావు మాట్లాడుతూ, సంస్థపై నమ్మకంతో ప్రతి నెలా పొదుపు చేస్తున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. చింతపల్లిలో సంస్థకు సొంత భవనం నిర్మాణ పనులు చేపట్టామని, అవి త్వరలో పూర్తిచేసి వచ్చే ఏడాది నుంచి అక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కోజ్ వెంకటసుబ్బారావు, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్లు అచ్చిబాబు, అరుణ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న చిట్టిబాబు

జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నోత బాలికల పాఠశాలలో గురువారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు బూడిదే. చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ నేల 18నుండి 20వరకు వినియోగదారుల క్లబ్ ఉన్న ప్రతి. పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలను జిల్లా స్థాయికి 21,22, న జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాలో గెలుపొందిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు, జిల్లా హ్యూమన్ రైట్స్ జాయింట్ సెక్రటరీ చిట్టిబాబు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులు మోద గిరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు, జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షురాలు టి. సరస్వతి, మండల అధ్యక్ష కార్యదర్శులు కె. శైలజ, ఎస్. లావణ్య, విద్యార్ధిని లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలంలోని వెల్లంకి గవర్నమెంట్ హైస్కూల్, బొడ్డపాలెం గవర్నమెంట్ స్కూల్లో బాల్యవివాహాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక అనర్థాలను విద్యార్థులకు వివరించారు. బాల్యవివాహ నిరోధక చట్టం, ఫోక్సో యాక్ట్, బాలల హక్కులు తదితర సేవలపై అవగాహన కల్పించారు. సమస్యలపై ఉమెన్స్ హెల్ప్‌లైన్ -181, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్-1098, వన్ స్టాప్ సెంటర్ సేవల వివరాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.శిరీష, సిబ్బంది బి.మమత, మాలతి, జె.కుమారి, ఉపాధ్యాయులు ఎంఎస్‌కె.శ్యామల, అంగన్‌వాడి టీచర్లు, 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న అంబుజా ఫౌండేషన్ ప్రతినిధులు

ఉద్యోగార్థుల తల్లిదండ్రులకు సత్కారం

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం దేవరపల్లి గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ తీసుకుని ఉద్యోగాలు సంపాదించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఉద్యోగ నియామక పత్రాలను రంపచోడవరం అంబుజా నైపుణ్యం ఫౌండేషన్ సంస్థ అద్వర్యంలో గురువారం అందజేసారు. అనంతరం అంబుజ ఫౌండేషన్ తరుపున తల్లిదండ్రులకు సన్మానం చేశారుఈ సందర్భంగా అంబుజా నైపుణ్య ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ మహేంద్ర పటేల్ మాట్లాడుతూ, తమ సంస్థద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్న లచ్చిరెడ్డి , మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, అంబుజా ఫౌండేషన్ తరపున సీనియర్ మేనేజర్ వెరిటికల్ హెడ్ మహేంద్ర పటేల్ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- వై.రామవరం : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 19 నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి ఎం.సుజాత, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం సుధారాణి తెలిపారు. మండలంలో ఉన్న, గ్రామాల నుంచి ధాన్యాన్ని రైతులు తెస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేస్తారన్నారు. సాధారణ రకం క్వింటా 2,369, గ్రేడు రకం క్వింటా రూ.2,389 కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు దళారులు మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు వారి ఖాతాలోనే జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో, బచ్చుల వెంకటరెడ్డి పల్లాల మంగిరెడ్డి ముళ్ళరాజు బజ్జల సోమరాజు రైతులు పాల్గొన్నారు

పీసా చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి- వై.రామవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వై రామవరం దిగువ ప్రాంతంలోని అన్ని సచివాలయాల ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు వార్డ్ నెంబర్లు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు, సెక్రెటరీలు, పంచాయతీ అభివృద్ధి అధికారులు గ్రామ సచివాలయ సిబ్బందికి పీసా చట్టంపై శిక్షణ నిర్వహించామని ఎంపీడీవో బాపన్న దొర తెలిపారు, అలాగే వై రామవరం ఎగువ పంచాయతీల్లోని వారందరికీ ఈనెల 20న ఉదయం 10 గంటల నుండి గుర్తేడు సచివాలయంలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు హాజరయ్యే పలు అధికారులు ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకొని రావాలని తెలిపారు

కనకమహాలక్ష్మి ఆలయానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరం బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసం ఆఖరి గురువారం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈసారి దేవస్థానం అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవడం వల్ల భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగలేదు. భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్‌లో మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెల్లవారుజామునే కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత వేద మంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సుమారు 20 వేల మంది అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జివిఎంసి సహకారంతో మంచినీటి సరఫరా చేశారు.

కనకమహాలక్ష్మి బ్యాంకు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు పాత నగరంలో నూతనంగా ఏర్పాటైన కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు టౌన్ కొత్త రోడ్డు శాఖ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మజ్జిగ, చిల్లర నాణేల పంపిణీ చేపట్టారు. భక్తులు, స్థానిక వ్యాపారులు బ్యాంకు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజరు కె.విశ్వనాథం, డిప్యూటీ మేనేజరు జె.శంకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బహుభాషా నాటకోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కళాభారతి ప్రాంగణం నాటక రంగ కళాభిమానులతో గురువారం నిండిపోయింది. ధన్యోస్మి, ముళ్ళ తీగలు ప్రదర్శనలకు ఆహూతులు ప్రశంసలు కురిపించారు. రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వేమలి త్రినాథరావు సారథ్యంలో మంగళవారం ప్రారంభమైన ఈ బహుభాషా నాటకోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు స్నిగ్ధ రాసిన ధన్యోస్మి నాటకాన్ని డాక్టర్ వేమలి త్రినాథరావు - డి.హేమా వెంకటేశ్వరి దర్శకత్వంలో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ సభ్యులు ప్రదర్శించారు. రెండో నాటికగా దండు నాగేశ్వరరావు రాసిన ముళ్ళ తీగలు నాటికను నవరస థియేటర్ ఆర్ట్స్ సభ్యులు ప్రదర్శించారు. దీనికి పివిఆర్.మూర్తి దర్శకత్వం వహించగా నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్.యశ్వంత్, ఎ.నారాయణ, డి.మదన్, ఎస్.తేజ, కె.జిగ్నాస్, ఎస్‌వికె.సాయి, కె.నిరుపం, ఎం.మదీనా నటించారు. ఈ ప్రదర్శనలకు ముందు జానపద, కోలాట నృత్యాలను రాజేశ్వరి బృందం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పలువురిని ఈ సందర్భంగా సత్కరించారు.



నాటకాన్ని రక్తికట్టిస్తున్న కళాకారులు

20న గాయత్రి కళాశాల గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల (అటామనస్) గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఈ నెల 20న నిర్వహిస్తున్నట్టు గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షులు డి.దక్షిణామూర్తి, సభ్యులు ఆచార్య పి.రాజు గణపతి తెలిపారు. ఈ మేరకు గురువారం గాయత్రి కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గాయత్రి కళాశాల రుషికొండ క్యాంపస్‌లోని సెంట్రల్ ఆడిటోరియంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు డిగ్రీ ప్రదానోత్సవాన్ని' ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కెయస్.బోస్, జివిపి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎ.సాయి రూప్, డి.పద్మజ పాల్గొన్నారు.

పొగమంచుతో పరేషాన్

వణికిస్తున్న చలి పులితో గిరిజనం ఇబ్బందులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి మంచు తీవ్రంగా కురుస్తుంది. చల్లటి చిరుగాలులు వీస్తూ చలి గజగజ వనికిస్తుంది. మంగళ బుధవారాల్లో మంచు అధికంగా కురుస్తూ సీలేరును తెరచాపలా కప్పేసింది. చలి మంచు తీవ్రతకు ప్రజలు తట్టుకోలేక నాన అవస్థలు గురవుతున్నారు. బుధవారం ఉదయం 8:30 వరకు ఏపీజెన్కో కాలనీ మార్కెట్ సెంటర్ దుర్గావీధి అల్లూరువీధి తదితర ప్రదేశాల్లో మంచు కప్పేయడంతో ప్రదేశాలు కనిపించలేని పరిస్థితి నెలకొంది. ఒకేసారి మంచు చలి అధికం కావడంతో వద్ధులు చలికి తట్టుకోలేక ఇబ్బందులు గురవుతున్నారు. దినసరి కూలీలు పరిస్థితి దనియంగా మారింది. కులి పనులకు చలితో వెళ్లలేక ఇంటి వద్ద చలికి తట్టుకోలేక సతమతం అవుతున్నారు. దారకొండ దుప్పిలివాడ పంచాయతీ పరిధి మారుమూల గ్రామాల్లో గిరిజనులు పొలం పనులకు వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. వరి పొలాల్లో దట్టంగా మంచు కురవడంతో వరి కోతలు కోయలేని పరిస్థితి ఏర్పడింది. మంచు తగ్గుముఖం పట్టిన తర్వాత ఉదయం 10 గంటలకి పొలాలకు గిరిజనులు వెళ్లి వరి కోతలు మొదలు పెడుతున్నారు. గతంలో ఇటువంటి వాతావరణం ఎప్పుడు ఏర్పడలేదని భయంగాలని చెందుతున్నారు. వాతావరణంలో సముల మార్పులు చోటు చేసుకోవడంతో దగ్గు రొంప వైరల్ ఫీవర్స్ ప్రజల్లో రోజురోజుకి అధికమవుతున్నాయి. మరి కొంతమంది దగ్గు ఆవేశంతో ఇబ్బందులు గురవుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరుగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఆంధ్ర ఒడిశాసరిహద్దు ప్రాంతం స్థానిక ప్రజలు మంటలు వేసుకుంటూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.



దట్టంగా కురుస్తున్న మంచు



హేమశ్రీని అభినందిస్తున్న లోతా రామారావు తదితరులు

హేమశ్రీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : మండలంలోని లోదొడ్డి పంచాయతీ కార్యదర్శి హేమశ్రీ సేవలు అభినందనీయమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. లోదొడ్డి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎల్.హేమశ్రీ, ఉద్యోగోన్నతితో బదిలీపై వెళుతున్న నేపథ్యంలో పంచాయతీ సర్పంచ్ లోతా రామారావు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం లోదొడ్డి గ్రామ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ.లోదొడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శిగా హేమశ్రీ మూడున్నరేళ్ల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించారని, సమస్య పరిష్కారానికి కృషి చేవారన్నారు. అలాగే సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసి అడ్డతీగల మండలం, దుచ్చర్తి బదిలీపై వెళ్లిన కృష్ణారెడ్డిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పొత్తూరి సత్యనారాయణ, కోటంశెట్టి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వో లు చదల వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది,అంగన్వాడి,ఆశ వర్కర్లు, ఎఎన్ఎం లు శ్రీనివాస్, సత్యనారాయణ, తేజ, కృష్ణ, రాజేశ్వరి, భవాని, గంగ పాల్గొన్నారు.

సిపిఎకు క్రికెట్ కిట్ వితరణ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు క్రికెట్ అసోసియేషన్(సిసిఎ) క్రీడాకారులకు రాష్ట్రక్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి క్రికెట్ కిట్లను పంపారు. ఆ క్రికెట్ కిట్లను డిడిఒ విజయ్ కుమార్ గురువారం చింతూరు క్రికెట్ గ్రౌండ్‌లో చింతూరు క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా క్రికెట్ కిట్లను పంపించిన స్పోర్ట్స్ మినిస్టర్ రాంప్రసాద్ రెడ్డికి, తమకు అందజేసిన డిడిఒకు చింతూరు క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కణితి గణేష్, బుచ్చిరాజు, పాల్వంచ రవి, మడివి. రాజు, షాహిద్, స్టీఫెన్, బిట్టు, ప్రదీప్, ప్రవీణ్, గంగు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరించాకే ఓట్ల బదిలీ

ప్రజాశక్తి- విఆర్.పురం: సమస్యలన్నీ పరిష్కరించాకే ఆర్అండ్ఆర్ కాలనీ బైరవ పట్నానికి సంబంధించిన పంచాయతీలోకి జీడిగుప్ప గ్రామస్తుల ఓట్లు బదిలీ చేయాలని కోరుతూ తీర్మానించారు. గురువారం జీడిగుప్ప సచివాలయం వద్ద సర్పంచ్ మూట్ల బాలరాజ్ అధ్యక్షతన, నిర్వహించిన సమావేశంలో ఆదివాసి కొండరెడ్ల సంఘం నాయకులు ముర్ల కనకా రెడ్డి మాట్లాడుతూఎంచుకున్న ఆర్అండ్ఆర్ పునర్వాస కాలనీలో డ్రైనేజీ, బడి, గుడి ఇతరత్రా మౌలిక సమస్యలు ఉన్నాయన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి, అన్ని సదుపాయాలను సమకూర్చిన తర్వా జీడిగుప్ప గ్రామస్తులు ఆధార్, ఓటరు, రేషన్ కార్డులను బదిలీ చేయాలన్నారు. అవేవీ లేకుండా తమ ఆధారాలను బదిలీ చేయడం సరికాదన్నారు. జీడిగుప్ప పంచాయతీ ఎన్నికలు జీడిగుప్పలోనే జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. సమావేశంలో పీసా కమిటీ సభ్యులు కదల కొండారెడ్డి పోడియం గోపాల్ వల్ల గణపతి రెడ్డి, కోట్ల ఆనందరెడ్డి , కనుగుల హేమలత, కెచ్చల హరినాథ్ రెడ్డి, కనుగుల పెద్ద శ్రీనివాస్ రెడ్డి, జీడిగుప్ప కార్యదర్శి వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, జీడిగుప్ప గ్రామస్తులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రమాదకరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలోకి మార్చే ప్రయత్నాలను విరమించాలని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు జెవి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిపిపి విధానాన్ని అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రమాదకరమైనదని ఆందోళన వ్యక్తం చేశారు